క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరం ప్రాంతానికి చెందిన ఎం.మోహన్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై విశాఖ వెళ్తుండగా తొట్లకొండ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్ తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక యువకులు ప్రమాదాన్ని గుర్తించి మోహన్‌ను రుషికొండలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పద్మనాభంలో అన్నదానం

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని షిర్డీ సాయి, పార్వతమ్మ ఆలయాల 20వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. కృష్ణాపురం, పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, మద్ది గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఫాదర్ చైతన్యకుమార్ బాధ్యతల స్వీకరణ



ఫాదర్ చైతన్యకుమార్‌కు స్వాగతం పలుకుతున్న సంఘ సభ్యులు

భీమునిపట్నం : భీమిలి సమీపంలోని సెయింట్ పీటర్స్ చర్చి ఫాదర్‌గా బిషప్ చైతన్యకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఫాదర్‌గా పని చేసిన ప్రభుదర్శనం ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చైతన్యకుమార్ బాధ్యతలు స్వీకరించగా ఆయన్ను చర్చి సంఘ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. సభ్యులు లక్ష్మణ్, సుశీల, సాగర్, మేరీ, శేఖర్, లత, మీనా, విజయ్ పాల్గొన్నారు.

విజయోత్సవాలు నిషేధం

పద్మనాభం : గెలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం విజయోత్సవాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని పద్మనాభం పోలీసులు హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో గ్రామాల్లో ప్రజలు గుమిగూడవద్దని సూచించారు. బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచకూడదన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో మెసేజ్‌లు చేసినా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మధురవాడ : అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు యత్నించిన బూర చంద్రమౌళి (39) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ పనోరమ హిల్స్‌లో భార్య ఆశారాణి, 14 ఏళ్ల కుమారుడితో చంద్రమౌళి నివసించేవారు. ఉద్యోగం లేకపోవడంతో అత్త వెంకటరత్నం పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవించేవారు. ఈ నేపథ్యంలో అతని భూమిని విక్రయించడం, అత్త మరణించడంతో ఆమె బంగారాన్ని కూడా తనఖా పెట్టారు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేక మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మార్చి 25న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం విమ్స్‌లో మృతి చెందాడు. భార్య ఆశారాణి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్వీసు రోడ్డు లేక ఇబ్బందులు



మారికవలస వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు



సర్వీసు రోడ్డు విస్తరించాల్సిన ఓ జోన్ వ్యాలీ వైపు ఉన్న రోడ్డు

రాంగ్ రూట్‌లో ప్రయాణాలతో ప్రమాదాలు

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జాతీయ రహదారికి ఆనుకుని ఇరువైపులా రెండు పెట్రోల్ బంక్‌లు, గాయత్రి హాస్పిటల్, మెట్రో వంటివి ఉన్నా సర్వీసు రోడ్లు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ మంది రాంగ్ రూట్ ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గాయత్రి హాస్పిటల్ వైపు సుమారు 50 మీటర్ల మేర సర్వీసు రోడ్డు లేకపోవడంతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు సైతం రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నాయి. విద్యా సంస్థలు తెరిస్తే స్కూలు బస్సులు కూడా ఇదే బాటలో వెళ్తున్నాయి. గాయత్రి హాస్పిటల్ వైపు కొమ్మాది పెట్రోల్ బంక్ నుంచి వైఎస్సార్ కాలనీ వరకు ప్రభుత్వం సుమారు రూ.17 లక్షలతో సర్వీసు రోడ్డు నిర్మించింది. వైఎస్సార్ కాలనీ చైతన్య స్కూల్ నుంచి గాయత్రి హాస్పిటల్ వరకు పాత రోడ్డు ఉండడంతో ఒన్ వే ప్రయాణాలు తప్పుతున్నాయి. కానీ గాయత్రి హాస్పిటల్ – మారికవలస పాత పెట్రోల్ బంక్ నుంచి మారికవలస – తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు వరకు సర్వీసు రోడ్డు పొడిగిస్తే ఇబ్బందులు తప్పుతాయి. ముఖ్యంగా ఇటు వైపు హాస్పిటల్ ఉండడంతో అత్యవసర సమయాల్లో తప్పక ఒన్‌వే ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వీరు అంటున్నారు. పైగా రోడ్డు దాటాలంటే ఇటు మారికవలస అటు కొమ్మాది వరకు వెళ్లాల్సి రావడం మరింత ఇబ్బందిగా వుందని అంటున్నారు. ఇక్కడ సర్వీసు రోడ్డును పొడిగించాలని స్థానికులు, హాస్పిటల్‌కి వచ్చే రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

ఓజోన్ వ్యాలీ రోడ్డులోనూ అదే దుస్థితి

మధురవాడ – ఆనందపురం వైపు వెళ్లే హైవేలో ఓజోన్ వ్యాలీ రోడ్డు వైపు మరో పెట్రోల్ బంక్, డిమార్ట్‌తోపాటు గిరిజన గురుకుల బాలికల రెసిడెన్షియల్ స్కూల్, ఇతర విద్యా సంస్థలు ఉన్నాయి. వీటికి వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైతం విధిలేని పరిస్థితుల్లో తప్పు అని తెలిసి కూడా రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. కొమ్మాది జంక్షన్ నుంచి మారికవలస జంక్షన్ వరకు సర్వీసు రోడ్డును విస్తరిస్తే ఇబ్బందులతోపాటు ప్రమాదాలు కూడా తప్పుతాయని స్థానికులు అంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

98.98 శాతం పింఛన్ల పంపిణీ





మధురవాడలో పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని 5 నుంచి 13 వరకు గల వివిధ వార్డుల్లో ఇంటింటా, డీబీటీ ద్వారా పింఛన్ల పంపిణీ 98.98 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. జోన్‌లో మొత్తంగా 20,413 మంది లబ్ధిదారులు ఉండగా 14,151 మందికి డీబీటీ ద్వారా బ్యాంకులకు నగదు బదిలీ చేశారు. 6,262 మందికి ఇంటింటికీ వెళ్లి సచివాలయ కార్యదర్శులు పంపిణీ చేసినట్టు చెప్పారు. జీవీఎంసీ 5వ వార్డులో 99.31, 6వ వార్డులో 98.18, 7వ వార్డులో 98.90, 8వ వార్డులో 98.70, 9లో 98.68, 10లో 99.32, 11లో 99.33, 12లో 99.47, 13వ వార్డులో 99.38శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మొత్తంగా 20,413 మందిలో 20204 మందికి పింపిణీ చేయగా 98.98 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్టు చెప్పారు.

చోరీ చేసి... అమ్మేస్తున్నారు..!



సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం వద్ద ఫెన్సింగ్ వైరు తొలగించిన దృశ్యం



పార్కు ప్రధాన ద్వారం పక్కన ఫెన్సింగ్ వైరు మాయమైన దృశ్యం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో రక్షణ లేని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను చిల్లర దొంగలు కొల్లగొడుతున్నారు. విలువైన స్థలాలను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన ఐరన్ ఫెన్సింగ్, గేట్లను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. అంతేకాకుండా స్థానిక ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలకు రక్షణగా ఉంచిన ఇనుప కంచె ట్రీ గార్డులను, పార్కుల్లోని ఆట వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. తమ అభిమాన ప్రజాప్రతినిధులు, నాయకుల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్‌లను కూడా వదిలి పెట్టడం లేదు. ఇలా మాయమైన వాటిని పట్టణ శివారులో ఉన్న స్క్రాప్ దుకాణాలకు విక్రయిస్తున్నారు.

వీటిని గుర్తించిన బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా స్క్రాప్ దుకాణాల యజమానుల్లో మార్పు రావడం లేదు. దీంతో చిల్లర దొంగతనాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇటీవల బాధితులు, స్వచ్ఛంద సంస్థలు ఐరన్‌కు బదులుగా ప్రత్యామ్నాయంగా సిమెంట్ వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన చోట్ల కూడా స్క్రాప్‌కు సంబంధించిన చోరీలు జరగకుండా పోలీస్ యంత్రాంగం గట్టిగా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం



స్వామికి వస్త్రాలు సమర్పిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ దంపతులు



హాజరైన ఉభయదాతలు, భక్తులు

- పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణదారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దాం

- స్టీల్ సీఐటీయూ పిలుపు
- 14న రక్తదాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ జూన్ 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పీఎం పాలెం : వెన్ను నొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 7వ వార్డులోని మిథిలాపురి ఉడా కాలనీలో గల ఓ అపార్టుమెంటులో సింగిరెడ్డి రామాంజనేయ రెడ్డి కుటుబంతో నివసిస్తున్నారు. అతను నగరంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీలో ఉద్యోగం చేస్తున్నారు. తన తల్లి గంగాభవానీ (54) గదిలో లేదని విధి నిర్వహణలో ఉన్న అతనికి ఫోను వచ్చింది. వెంటనే ఇంటికొచ్చి తాను నివసిస్తున్న అపార్టుమెంట్ చుట్టుపక్కల వెతికాడు. ఫలితం లేకపోవడంతో మధ్యాహ్నం 12 : 30 గంటలకు తన తల్లి అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా వాంబేకాలనీకి సమీపంలోని మామిడితోటలో ఓ మహిళ చెట్టుకు ఉరి వేసుకున్న వార్త తెలియడంతో రామాంజనేయ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉరి వేసుకున్న మహిళ తన తల్లి గంగాభవానీగా గుర్తించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ అప్రోచ్ రోడ్డు వద్ద ప్రమాదాలు



సంగివలస కాలనీ అప్రోచ్ రోడ్డు వద్ద ఎత్తుగా ఉన్న డెబ్రిస్

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కాలనీ అప్రోచ్ రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డు మార్గంలో డెబ్రిస్ కారణంగా తరచూ స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. సర్వీస్ రోడ్డు నుంచి కాలనీ రహదారి పల్లపు ప్రాంతంలో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు అంటున్నారు. కాలనీ పక్కనే చెరువు నుంచి మిగులు నీటిని బయటకు పంపించేందుకు జీవీఎంసీ ఈ మార్గంలో తాత్కాలికంగా పైప్‌లైన్ వేసి డెబ్రిస్‌తో పూడ్చి వేసింది. పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో ఈ మార్గంలో డెబ్రిస్ గట్టిపడి వాహనాల ప్రమాదాలకు కారణమవుతోంది. గట్టిపడిన డెబ్రిస్‌ను తొలగించి మార్గాన్ని సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ ఆర్.రాజేంద్రరావు (36) అదృశ్యమైన ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం వెలగవలసకు చెందిన రాజేంద్రరావు స్టీల్‌ప్లాంట్ యూనిట్‌లో పని చేస్తూ అక్కడి బ్యారక్స్‌లో ఉంటున్నారు. రాజేంద్రరావు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బ్యారక్స్ నుంచి లుంగీతో బయటకు వెళ్లిన రాజేంద్ర తిరిగి బ్యారక్స్‌కు చేరలేదు. దీంతో సీఐఎస్ఎఫ్ ఎస్ఐ అందించిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీకి అభినందనలు



ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి నవీన్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని విభాగాధిపతిని కోరారు. ఆస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, బి.ఎస్.రాజు, బి.టి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు నేడే తెర

తుది లెక్కలతో కార్యకర్తలు, నాయకుల కుస్తీ

తగరపువలస : సాధారణ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమవుతున్నందున చివరి రోజైన సోమవారం వరకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లపై లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నుంచి వెలువడిన వివరాలతోపాటు పోలైన ఓట్లలో తమకు పక్కాగా పడినవి పదే పదే లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపుపై అంచనాలతో సోమవారం సాయంత్రం వరకు నియోజకవర్గంలో పలుచోట్ల నుంచి నాయకులు, కార్యకర్తలు బెట్టింగులు ఎవరిపై వేయవచ్చు.., ఎంత మొత్తం వరకు వేయవచ్చన్న అంచనాలతో డబ్బులు ఫణంగా పెడుతున్నారు. దీని కోసం ఒకటికి రెండు సార్లు ఆరా తీస్తున్నారు. ఫోన్ల ద్వారా కూడా తమకు తెలిసిన వారిని గెలుపు ఓటములపై అడిగి తెలుసుకుంటున్నారు. అడిగిన వారినే మళ్లీ మళ్లీ అడుగుతూ సంతృప్తి చెందుతున్నారు. దీనికితోడు తమ అభ్యర్థులు గెలవాలని చివరి ప్రయత్నంగా దైవాన్ని అభ్యర్థిస్తున్నారు. మొక్కులు మొక్కుకుంటూ ఆలయాల ముందు కొబ్బరికాయలు పగులగొడుతున్నారు. ఇదిలా ఉండగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సైలెంట్ ఓటింగ్ తమ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును విజయ తీరాలకు చేరుస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

మధురవాడ పరిసర ప్రాంతాల్లో వర్షం



వర్షానికి కూలిన మిథిలాపురి వుడా కాలనీలోని అపార్ట్‌మెంట్ ప్రహరీ



చంద్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో చేరిన వర్షం నీరు

మధురవాడ : రుతుపవనాలు పలకరించక ముందే మధురవాడలో వర్షం చల్లని కబురు అందించింది. గత రెండు రోజులుగా మధురవాడ పరిసర ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా మధురవాడ అప్ బ్రిడ్జి, రేవళ్లపాలెం, చంద్రంపాలెం హైస్కూల్ మైదానం, మధురవాడ డైలీ మార్కెట్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో గల ఎంవీవీ ఓ జోన్ అపార్ట్‌మెంట్‌కి చెందిన ప్రహరీ పెద్ద శబ్ధంతో ఆదివారం రాత్రి కూలిపోయింది. సుమారు 70 అడుగుల మేర ప్రహరీ కూలిపోవడంతో స్థానికులు ఆందోళన చెందారు.

రోడ్డు మధ్యలో గొయ్యితో ప్రమాదాలు



సిమెంట్ పలకలు పగిలిపోవడంతో రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

భీమునిపట్నం : స్థానికంగా ఎక్కువ మంది రాకపోకలు సాగించే రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. భీమిలి మెయిన్ రోడ్డులోని శివాలయం ఎదురుగా బీచ్‌కు వెళ్లే రోడ్డులో రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

రెండు సంవత్సరాల క్రితం ఈ రోడ్డు కింద నుంచి వెళ్తున్న మురుగు కాలువ పూడుకుపోవడంతో అధికారులు రోడ్డును పగులగొట్టి కింద ఉన్న కాలువకు మరమ్మతులు నిర్వహించారు. అనంతరం కాలువను మూసివేసి దానిపై ఏర్పడ్డ గొయ్యిని సిమెంట్ పలకలతో మూసివేశారు. కాగా కొద్ది రోజుల క్రితం ఆ పలకలు పగిలిపోవడంతో దాని కింద గొయ్యి బయటపడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో వీధిలైట్లు సరిగ్గా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. నడిచి వెళ్లేవారు చాలా మంది పడిపోతుండడంతో గాయపడుతున్నారు. ఈ గొయ్యి మరింత పెద్దది కాకముందే కొత్త పలకలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బోరుబావులు పనిచేయక ఇబ్బందులు



రేగానిగూడెంలో భూమిలోకి కూరుకుపోయిన బోరు



పొడుగుపాలెంలో శిథిలమైన బోరు ప్లాట్‌ఫారం

తగరపువలస : ఆనందపురం మండలంలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నిరక్ష్యానికి అద్దం పడుతున్నాయి పలు బోరుబావులు. ప్రస్తుతం తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో సిబ్బంది విఫలమయ్యారని ఆయా పంచాయతీల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని కుసులవాడ పంచాయతీ రేగానిగూడెంలో వందలాది కుటుంబాలకు తాగునీరు అందించే బోరుబావి భూమిలోకి కూరుకుపోయింది. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలో ఇటీవల బోరుకు హెడ్ బిగించిన సిబ్బంది ప్లాట్‌ఫారం మధ్య మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో అక్కడ వాడుక నీరు తిరిగి అందులోనే ఇంకిపోతోంది. ఈ బోరుబావులను ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

వేట సన్నాహాల్లో మత్స్యకారులు



అప్పుఘర్‌లో వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ: వేట విరామం గడువు దగ్గరకు వస్తుండడంతో మత్స్యకారులు వేటకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చేపల వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా అప్పుఘర్, జాలరిపేటలో చాలా మంది మత్స్యకారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏటా వేట విరామం పాటిస్తుండడంతో రెండు నెలలుగా మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఈ నెల 15వ తేదీతో ఆ గడువు ముగియనుండడంతో చేపల వేటకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకునే పనిలో మత్స్యకార గ్రామాలు నిమగ్నమయ్యాయి. ఈ మేరకు 18, 19 వార్డుల్లో అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేటలో ఎక్కడ చూసిన మత్స్యకారుల సన్నద్ధత దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. మత్స్యకారులు వలలు, బోట్లు, ఇంజిన్లను సరిచేసుకుంటూ వేటకు సిద్ధమవుతున్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

మద్దిలపాలెం : మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రేరణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందన్నారు. దోమలు వృద్ధి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.